



# బిగ్-బ్రదర్స్ బెదిరింపులు!



మొదటిపేజీ తరువాయి...

కొనసాగుతున్నాయి. బెదిరించో, భయపెట్టో భూములు గుంజుకుంటున్నారు. దిక్కుతోచని స్థితిలో భూములపై తమ హక్కులను రైతులే గుగ్గిళ్లకు గుర్రాలను అమ్ముకున్నట్టు అర్పించుకోవాల్సిన అగత్యంలోకి నెడుతున్నారు. భూ రికార్డుల్లోని గందరగోళాన్ని అడ్డుపెట్టుకొని అధికారపార్టీకి చెందిన ఓ కీలక నేత సంబంధీకులు, సోదరులు కుందారం భూములను చెరపడుతున్నట్టు ఆ గ్రామాల్లో ప్రచారం జరుగుతున్నది. అందుకోసం గతంలో నయీం అనుచరులుగా వ్యవహరించినవారినీ రంగంలోకి దింపి భీతావహ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని వివిధ గ్రామాల ప్రజలు చెప్తున్నారు.


కుందారం భూములంటేనే తెలంగాణవ్యాప్తంగా ప్రసిద్ధి. గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా.. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వచ్చే వెల్దండ మండలంలోని అజలాపురం, బైరాపూర్, మాడ్గుల మండలంలోని అంతిరెడ్డిపల్లి, దిలావార్‌ఖాన్‌పల్లి, ఇర్విన్, కుందారం తండా, లాల్‌తండాల్లో ఈ భూములు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం ఈ భూములన్నీ రంగారెడ్డి జిల్లా ఇర్విన్ గ్రామ పరిధిలోకి వస్తున్నాయి. పూర్వం ఈ భూములు వనపర్తి సంస్థానం రంగనాయకమ్మకు చెందినవి. అనంతరం నిజాం కాలంలో భూశిస్తు అమలులో ఉండేది. ఒకవేళ ఎవరైనా తమ భూములకు శిస్తు చెల్లించనట్టయితే ఇతరులు ఎవరైనా ఆ భూములకు వాస్తవ మొత్తంలో సగం చెల్లించినా అవి వారి పేరిట కొనసాగేవి. అలా సగం శిస్తు ఇతరులు చెల్లించిన భూములను మక్త భూములు అంటారు. అలా అజలాపురం గ్రామానికి చెందిన కుందారం వంశీయుల ఆధీనంలోకి ఈ మక్త భూములు వెళ్లాయి. ఇలా ఇర్విన్ గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 1003 నుంచి 1053 వరకు దాదాపు 700 ఎకరాలకు పైగా భూములు రెవిన్యూ రికార్డుల్లో రఘుమారెడ్డి, గీతారెడ్డి, సీతారెడ్డి, మోహన్‌రెడ్డి పేర్ల మీద వస్తున్నాయి. వాస్తవానికి కుందారం వంశీయులు ఈ భూములను సాగు చేయకపోవడంతో గ్రామంలోని నిరుపేద రైతులు సాగు చేసుకుంటూ వస్తున్నారు. కుందారం వంశీయులు చాలామంది ఏండ్ల కిందటే విదేశాల్లోను, హైదరాబాద్‌లోనూ స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో తమ భూములను సాగు చేసుకుంటున్న వారిని అందులో నుంచి వెళ్లిపోవాలని కుందారం వంశీయులు హెచ్చరించడం, తమకు గత్యంతరం లేదు.. భూములను సాగు చేసుకుంటామని వాళ్లు వేడుకోవడం... ఏండ్ల తరబడి ఇదే కొనసాగుతూ వచ్చింది. ఈ క్రమంలోనే 90వ దశకంలో నక్సల్స్ ప్రాబల్యం ఈ గ్రామంలో మొదలవడం జరిగింది.

## పతాకస్థాయిలో భూ పోరాటం

అజలాపురానికి చెందిన పాతతరం వారు చెప్తున్న వివరాలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బీఎడ్ చేసిన ఆ ప్రాంతానికి చెందిన కూన నిరంజన్ అనే యువకుడు కుందారం భూములపై పేద రైతులకు హక్కు కల్పించాలనే లక్ష్యంతో నక్సల్స్ వైపు ప్రభావితం అయ్యాడు. అనంతరం ఇలా గ్రామంలో ప్రతి ఇంటి నుంచి ఒకరిద్దరు యువతీ యువకులు ప్రభావితులై అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇలా అప్పట్లో పీపుల్స్‌వార్‌కు అజలాపురం గ్రామ పరిసరాల్లో గణనీయమైన పట్టు వచ్చి, సేఫ్టీ జోన్‌గా కూడా మారింది. ఈ క్రమంలో కుందారం వంశీయులు ఒక్కరు కూడా గ్రామంలో ఉండే పరిస్థితి లేకుండా పోయింది. కనీసం పోలీసులు సైతం ఆ గ్రామాల పరిసరాల్లోకి వెళ్లే పరిస్థితులు ఉండేవి కావని కొందరు గ్రామస్థులు తెలిపారు. ఇలా పీపుల్స్‌వార్ ఆధ్వర్యంలోనే కుందారం భూములు నిరుపేద రైతులకు పంపిణీ చేశారని చెప్తున్నారు. ఇక్కడ విశేషమేమిటంటే... 700 ఎకరాల్లో ఒక్క ఎకరా కూడా ఇప్పటికీ రాళ్లు, రప్పలు లేకుండా సాగవుతున్నదంటే ఆదినుంచీ రైతులు నిరంతరాయంగా ఈ భూములను సాగు చేశారని అర్థమవుతున్నది. అయితే పేద రైతులు ఆ భూములను సాగు చేసుకుంటున్నప్పటికీ రెవిన్యూ రికార్డుల్లో మాత్రం కుందారం వంశీయుల పేర్లే కొనసాగాయి.

## రంగంలోకి నయా నయీంలు

**భూరికార్డుల** గందరగోళం కుందారంలో భూదందాకు దారితీస్తున్నది. ఆ రికార్డులను అడ్డుపెట్టుకుని, అధికారం అండచూసుకుని.. సదరు సోదరులు రైతుల భూములను చెరపడుతున్నారు. తెలంగాణకు నయీం పీడ విరుగడైందనుకుంటున్న తరుణంలో.. మళ్లీ నయా నయీంలను సృష్టిస్తున్నారు. గతంలో నయీంకు అనుచరులుగా వ్యవహరించినవారు కొందరు కుందారం భూముల దందాలోకి దిగారు. ఒకటీ అరా కాదు... ఏకంగా నాలుగు వందలకు పైగా ఎకరాలే లక్ష్యంగా ఈ బలవంతపు కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు వంద ఎకరాలకు పైగా ఒప్పందాలు పూర్తయ్యినట్టు సమాచారం. 'ఉన్న భూమిని అమ్ముతవా? లేదా??' అన్న రీతిలో ఈ దౌర్జన్యకాండ కొనసాగుతున్నది. ఈ గ్రామాల్లోని ఏ ఒక్క రైతును కదిలించినా.. హడలెత్తిస్తున్న భూదందా మీదనే గోడు వెల్లబోసుకుంటున్నాడు. ఏ ఒక్క రాజకీయ నాయకుడిని కదిపినా.. నయీం అనుచరుల పేర్లు ఉచ్చరిస్తూ వణికిపోతున్నారు. అంతేకాదు... కుందారం భూములకు సమీపంలోనే ట్రిపుల్ ఆర్ వెళ్లేలా అలైన్‌మెంట్ మార్పు జరగడంతో పాటు ఆమన్‌గల్-రావిర్యాల 300 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి సైతం ఈ భూముల లక్ష్యంగానే నిర్మాణం అవుతున్నదంటే.. కుట్రకు ఏ స్థాయిలో ప్రణాళికలు రచించారో అర్థం చేసుకోవచ్చు.



## ఎకరానికి 40 లక్షలు.. 4 లక్షలకే కొనుగోలు!

ఈ భూములపై కన్నేసిన 'బిగ్-బ్రదర్స్' వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఇందులో భాగంగానే ఒకవైపు ట్రిపుల్-ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో మార్పు చేశారు. దీంతోపాటు ఆమనగల్-రావిర్యాల గ్రీన్‌ఫీల్డ్ 300 ఫీట్ల రహదారిని కూడా దీనికి సమీపంలోనే ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో మరోవైపు కొందరు వ్యక్తులను రంగంలోకి దించి పెద్దవిత్తున భూములను కొనుగోలు చేస్తున్నారు. ఇందులోనే నయీం అనుచరులు కీలకపాత్ర పోషిస్తున్నట్టు గ్రామస్తులు కొందరు తెలిపారు. ముఖ్యంగా ఓఆర్సీ, పాసు పుస్తకాలు లేకుండా కబ్జాలో ఉన్న రైతులను ముందుగా టార్గెట్ చేశారు. 'ఎలాగూ మీకు డాక్యుమెంట్లు లేవు... ఎంతోకొంతకు అమ్ముకుంటే ఇప్పుడు పైసలొస్తయి. లేదంటే భూమి నుంచి వెళ్లగొడ్తరు. మేం ఎలాగోలా సీసీఎల్ఏలో రికార్డుల్లో నమోదు చేసుకుంటాం' అని చెప్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. భూములియ్యబోమని మొండికేసినవారిని బెదిరిస్తున్నారు. వాస్తవానికి ఇక్కడ ఎకరా రూ.30 లక్షల నుంచి 40 లక్షల వరకు ధర పలుకుతుండగా... కేవలం రూ.3-4 లక్షలకే కొనుగోలు చేసుకొని, ప్రైవేటు ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఆపై ఓఆర్సీ ఉండి, భూమిపై ఉన్న వారిని కూడా బెదిరిస్తున్నారు. రికార్డుల్లో తక్కువ ఉండి, కబ్జాలో ఎక్కువ ఉన్నందున మొత్తానికి ఒక రేటు నిర్ధారించి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు వందెకరాలకు పైగా భూమిని ఇలా కొనుగోలు చేసినట్టు సమాచారం. అయితే ఓఆర్సీ ఉండి పాసు పుస్తకాలు లేకుండా, కబ్జా మీద లేనివారు ఇప్పుడు వీరిచుట్టూ తిరుగుతున్నారు. మాకు ఓఆర్సీ ఉంది.. పైసలు మాకియ్యాలి అంటూ వేడుకున్నా కనికరించడంలేదని కొందరు రైతులు 'నమస్తే తెలంగాణ'తో ఆవేదన వ్యక్తం చేశారు.




## బెదిరింపులకు ఇంకేం సాక్ష్యం కావాలి?!

**రైతుకు,** భూమితో ఉండేది అవినాభావ బంధం. డాక్యుమెంట్లు లేకున్నా, ప్రభుత్వ రికార్డుల్లో పేరు లేకున్నా.. ఏండ్ల తరబడి భూమిని నమ్ముకొని సాగు చేస్తున్న రైతులు ఎప్పటికైనా తమను ప్రభుత్వం గుర్తించకపోతదా! పట్టా ఇయ్యకపోతదా!! అని ఎదురుచూస్తరు. అంతేకానీ భూమిని వదిలిపెట్టిపోడు. మరి అలాంటిది దశాబ్దాలుగా రెండు, మూడు తరాలు సాగు చేసిన భూమి నుంచి రాత్రికి రాత్రి పొమ్మంటే ఆ రైతు ప్రాణం ఎంత తండ్లాడుతది? కుందారపు భూముల్లో ఇప్పుడు అదే జరుగుతున్నది. ప్రపంచంలో ఎక్కడైనా భూమి అమ్మేందుకు, కొనేందుకు ఒప్పంద పత్రాలు చూశాం! కానీ రైతు భూమిని అడ్డికి పావుశేరులా కొని ఆ రైతును వెళ్లగొట్టేందుకు 'కబ్జా రద్దు ఒప్పంద పత్రం' ఎక్కడైనా చూశామా?! ఇది అదే! వందల ఎకరాలపై కన్నేసిన కొందరు వ్యక్తులు ఇలా బెదిరింపులకు దిగి.. భూమిని సాగు చేస్తున్నా, ప్రభుత్వ రికార్డుల్లోకి ఎక్కేది లేదు. ఆపై వెళ్లగొడితే వచ్చే నాలుగు పైసలు కూడా రావంటూ బెదిరించి ఇలా కబ్జా నుంచి వెళ్లగొడుతున్నారు. ఆ భూములను స్వాధీనం చేసుకొని చుట్టూ కడీలు పాతుకుంటున్నారు.

## వైఎస్ హయాంలో భూ హక్కులు

**ఉమ్మడి** ఆంధ్రప్రదేశ్‌లో 2004లో ఏర్పడిన వైఎస్ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపడం.. తదనంతర పరిణామాల తర్వాత ఈ గ్రామంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. 1972 ల్యాండ్ సీలింగ్ యాక్టు ప్రకారం 2006లో అప్పటి ప్రభుత్వం అందులోని 493.10 ఎకరాలను స్వాధీనం చేసుకుంది. మిగిలిన భూములు కుందారం వంశీయుల వద్దే ఉన్నాయి. కానీ ఆ భూములు తమవేనంటూ అప్పట్లోనే కుందారం వంశీయులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. కాగా సీలింగ్ యాక్టు ప్రకారం సేకరించిన భూములను.. భూమిలేని నిరుపేదలకు అధికారికంగా పంపిణీ చేసేందుకు అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఉషారాణి నేతృత్వంలో పెద్దఎత్తున కసరత్తు జరిగింది. 306 మంది రైతులకు ఈ భూములను పంపిణీ చేసేందుకుగాను వారికి ఓఆర్సీ (ఓనర్‌షిప్ రైట్ సర్టిఫికెట్) కూడా జారీ చేశారు. కానీ ఇందులో 138 మంది రైతుల పేర్లు మాత్రమే రెవిన్యూ రికార్డుల్లోకి ఎక్కి.. వారికే పట్టా పాసుపుస్తకాలు జారీ అయ్యాయి. ఈ లోగా కుందారం వంశీయులు కోర్టుల నుంచి స్టేలు తెచ్చుకోవడంతో మిగిలిన వారికి పాసు పుస్తకాలు జారీ అయ్యేందుకు అధికారులు కోర్టు కేసును సాకుగా చూపారు. అయినప్పటికీ సీలింగ్ యాక్టు కింద సేకరించిన భూములన్నింటిలోనూ రైతులు కబ్జా మీద ఉండి సాగు చేసుకుంటూనే ఉన్నారు. ఇలా కుందారం భూముల్లో సాగు చేసుకుంటున్నవారు మూడు రకాలుగా ఉన్నారు.

1. ప్రభుత్వం జారీ చేసిన ఓఆర్సీ ఉండి.. క్షేత్రస్థాయిలో భూ కబ్జాలో ఉన్నవారు. వీరిలోనూ కొందరు ఓఆర్సీ, పాసు పుస్తకాల్లో ఉన్న దాని కంటే ఎక్కువ విస్తీర్ణంలో (కొంతమంది 7-10 ఎకరాల్లో) సాగు చేసుకుంటున్నారు.
2. క్షేత్రస్థాయిలో భూమిని సాగు చేసుకుంటున్నప్పటికీ ఆ రైతులకు ఓఆర్సీగానీ, పాసు పుస్తకాలుగానీ లేవు.
3. 2006లో 306 మంది రైతులకు ఓఆర్సీలు జారీ కాగా.. వీరిలో 168 మందికి ఓఆర్సీలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో భూ కబ్జాలో లేరు. కేవలం ఓఆర్సీలు మాత్రమే ఉన్నాయి.

# దొంగరాత్రి డ్రోన్ల సర్వే!



### అర్ధరాత్రివేళ పల్లెల మీదికి సర్వే డ్రోన్లు

### రైతులకు తెలియకుండా పాలాల్లో హద్దురాళ్లు

**'దొంగ రాత్రి వేళ పల్లెల మీద డ్రోన్లు తిరిగుతున్నయ్. పంట పొలాల్లో కొత్త మనుషులు తిరుగుతున్నరు. పొద్దున లేచి చేనుకు పోతే హద్దు రాళ్లు పాతి, వాటి మీద 'X' ఆకారంలో ఎర్ర రంగు గుర్తులు పెట్టి ఉంటున్నయ్. ఇది ఎవడు పెట్టిండో.. ఎందుకు పెట్టిండో.. దొంగోని పనో? దొరోని పనో? జర పట్టుకొని జెప్పండ్రి సారు' అని ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు సమీపంలోని గ్రామాల రైతులు, ప్రజలు ఇటీవల పోలీసు స్టేషన్లకు వరుసకట్టారు. పోలీసులు ఫిర్యాదు తీసుకున్నారు కానీ ఇప్పటి వరకు ఏమీ తేల్చలేదు. తాజాగా డ్రోన్ల గుట్టు బయటపడింది. అవి రీజినల్ రింగ్ రోడ్డు అక్రమ అలైన్‌మెంటు కోసం సర్వే శాఖ నుంచి ఎగిరిన డ్రోన్లు అని తేలింది.**

(నమస్తే తెలంగాణ నెట్‌వర్క్)

ప్రజాప్రయోజనాల కోసం ప్రభుత్వం భూ సేకరణ చేస్తే అధికారులు ముందుగా ఫీల్డ్ విజిట్ చేయాలి. రైతులతో మాట్లాడాలి. సంబంధిత గ్రామాల్లో సభలు, సమావేశాలు పెట్టి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలి. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంపై రైతులను చైతన్యం చేయాలి. ఇది రాజ్యాంగ బద్ధంగా ఆమోదించబడిన భూ సంస్కరణ చట్టం రైతులకు కల్పించిన హక్కు. ఇప్పటివరకు నగరం ఉత్తర దిక్కు వైపు ఇదే రీజినల్ రింగ్ రోడ్డు కోసం చేసిన భూ సేకరణలో భూ సంస్కరణ చట్టం నిబంధనలనే పాటించి అప్పటి కేసీఆర్ ప్రభుత్వం భూ సేకరణ చేసింది. కానీ ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డుకు ఏ చట్టమూ లేదు. అధికారుల ఫీల్డ్ విజిట్ లేదు. రైతులకు సమాచారం లేదు. సర్వే అధికారులు దొంగల తీరున అర్ధరాత్రి, అపరాత్రి వేళ పంట పొలాల మీద పడిపోతున్నారు. సర్వే కోఆర్డినేట్ మిషన్ చూపిన చోట హద్దు రాళ్లు పాతుతున్నారు. వాటికి రంగులు వేసి వెళ్లిపోతున్నారు. మరో దొంగ రాత్రి వేళకు డ్రోన్లను పంపి అలైన్‌మెంటు చేస్తున్నారు. నగరానికి దక్షిణం దిక్కు రింగు రోడ్డు ప్రతిపాదిత అలైన్‌మెంటు కాదని ఒక ముఖ్యనేత కనుసన్నల్లో పంట పొలాల్లో పాము తిరిగినట్టు అష్టవంకర్లు తిరుగుకుంటూ వెళ్లిపోతున్నది. ఇటు మంచాల, యాచారం మండలాల నుంచి మొదలు వెల్దండ, మీదుగా ఇటు పూడూరు మండలంలోని గ్రామాల వరకు ఇదే తంతు.

## వరుసగా నాలుగు రాత్రులు..

**ఈ నెల ఎనిమిదో** తేదీ రాత్రి నుంచి వరుసగా నాలుగు రాత్రులు అంటే 12వ తేదీ వరకు యాచారం, చింతపట్ల మండలాల్లో డ్రోన్లు తిరిగాయి. యాచారం మండలం చింతపట్ల, మొండిగౌరెల్లి గ్రామాలు, మంచాల మండలంలోని చీదేడు, రంగాపూర్, జాపాల, మంచాల, కాగజ్ఘట్ గ్రామాలపై డ్రోన్లు తిరిగాయి. రాత్రి 9 గంటల ప్రాంతంలో పంట పొలాల్లోకి కొత్త మనుషులు వచ్చే వారని, 11 గంటలకు డ్రోన్లు లేచి తెల్లవారుజాము వరకు చెలకల మీద తిరిగాయని, 4 నుంచి 7 గంటల వరకు కొద్దిపాటి వ్యవధితో డ్రోన్లు ఒకదాని వెంట ఒకటి వచ్చేవని, దేనికది పది నుంచి పదిహేను నిమిషాల పాటు స్థిరంగా ఒక చోటే ఉండేదని గ్రామస్థులు చెప్పారు. 'మొదట పశువుల దొంగలు డ్రోన్ల తోటి గొర్రెలు, బర్రెలు, మేకల జాడలు గుర్తించటానికి వాడుతున్నారేమో అనుకున్నాం. డ్రోన్ల కదలికలపై నిఘా పెట్టి పట్టుకునేందుకు రాత్రంతా జాగారం చేశాం. కొందరం గుట్టల చాటున కాపు కాశాం' అని దాట్పల్లి గ్రామస్థులు చెప్పారు. మరి కొద్ది రోజులకే పంట పలాల్లో హద్దురాళ్లు పాతినట్టు గుర్తించామని, ఏమి జరుగుతుందో తెలియక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రంగాపూర్ గ్రామస్థులు తమ అనుభావాలను వివరించారు. హద్దు రాళ్లు పాతిన చోటు నుంచి జియో కేబుల్ లైన్ పోతున్నదని, రైతుల భూమికి ఎటువంటి ఇబ్బంది ఉండదని, పైగా నష్టపరిహారం కూడా ఇస్తారని తమ ఊరి వాళ్లే కొందరు ప్రచారం చేశారని మేడిపల్లి గ్రామానికి చెందిన రైతు చెప్పారు.

# గుడితండా గుండెపై ట్రిపుల్ ఆర్ పిడుగు!

### ఆ పేరు ప్రస్తావిస్తేనే తండావాసుల కన్నెర్ర

### పెద్దోళ్ల కోసం ఊరిని నాశనం చేస్తారా? అంటూ ఆగ్రహం

### నెల రోజులుగా నిద్ర పోతలేమని తీవ్ర ఆవేదన

ఆమనగల్లు, తలకొండపల్లి: ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తండా (గుడి తండా) గ్రామపంచాయతీలోని గుడి తండా సమీపంలో ట్రిపుల్‌ఆర్ మార్కింగ్ తండావాసుల గుండెల్లో మంటలు రేపుతున్నది. రింగు రోడ్డుకు మార్క్ పడింది మొదలు.. తండావాసులు తమ భూములు, ఇండ్లు పోతాయంటూ భయందోళనలకు గురవుతున్నారు. తండాలోకి కొత్తవారు ఎవరు వచ్చినా.. ట్రిపుల్‌ఆర్ గురించేనా? అంటూ ఆందోళనతో వాకబు చేస్తున్నారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు విషయమై గురువారం 'నమస్తే తెలంగాణ' బృందం తండాకు వెళ్లి గిరిజనులతో మాట్లాడేందుకు ప్రయత్నించింది. ఒకరిద్దరితో మాట్లాడుతుండగానే తండావాసులు గుంపుగా వచ్చి.. 'మా తండాకు ఎవరెవరో కొత్తవాళ్లు ఎందుకు వస్తున్నరు? వెళ్లిపోండి..! భూములు, ఇండ్లు అన్నీ పోతయ్. నెలరోజుల నుంచి తండాలో అందరం సరిగా నిద్ర కూడా పోతలేము' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రిపుల్ ఆర్ గురించి మాట్లాడటానికి తండాకు ఎవరు వచ్చినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. అలైన్‌మెంట్ గురించి రోజుకో కొత్త కథ చెప్తున్నారని అగ్రహం వ్యక్తంచేశారు.

## సన్న, చిన్నకారు రైతులే అధికం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను మార్చడంతో ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల ప్రజలు, రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కొత్త అలైన్‌మెంట్‌లో అధిక శాతం సాగు భూములే ఉండగా.. అందులో సన్న, చిన్నకారు రైతుల భూములే అధికం. ఎకరం, రెండు ఎకరాలను సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్న రైతులకే అలైన్‌మెంట్ మార్పుతో తీవ్ర నష్టం జరుగుతున్నది. ఆలైన్‌మెంట్ మార్పుతో భూస్వాములకు, పెద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగటం లేదని, గత ప్రభుత్వం ప్రతిపాధించిన అలైన్‌మెంట్ అందరికీ అమోదయోగ్యంగా ఉన్నది గుడితండావాసులు చెప్తున్నారు.



### తండాలో నుంచి రోడ్డు పోతే ఎలా?

*మేము కొన్ని తరాలుగా ఈ తండాలోనే ఉంటున్నం. ఉన్న కొద్దిపాటి భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నం. ట్రిపుల్ ఆర్ మార్క్‌ను తండా సమీపంలో వేయడంతో భూములు, ఇండ్లు కోల్పోతామని మా తండా భయపడుతున్నది. రెడ్ మార్క్ భయంతో అందరూ నిరాశలో ఉన్నరు. కొత్తవాళ్లు ఎవరైనా ఊరికి వస్తే ప్రజలు ఆందోళనకు గురవుతున్నరు. ప్రభుత్వం పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించి తండాను కాపాడాలె.*

*- ముడావత్ రాజు, గుడితండా (ఆమనగల్లు మండలం)*



## సర్వేల్‌లో ట్రిపుల్ -ఆర్ కలకలం

- మార్కింగ్‌పై రైతుల మండిపాటు
- అలైన్‌మెంట్‌మార్పుపై ఆర్డీవోకు ఫోన్
- తెలియకుండానే సర్వే: అధికారి

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబరు 19 (నమస్తే తెలంగాణ)/సర్వేల్: ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగంలోని అనేక గ్రామాల్లో ఇప్పుడు కలకలం, కలవరం కొనసాగుతున్నది. పాత అలైన్‌మెంట్ ఎక్కడినుంచి వెళ్తుందనేది గతంలోనే రైతులకు తెలుసు. అందులో అత్యధికం ప్రభుత్వ భూములే. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగైదు కిలోమీటర్ల మేర రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను జరపడంతో అత్యధికంగా సన్న, చిన్నకారు రైతుల భూములే బలికానున్నాయి.


కొత్త అలైన్‌మెంట్ తమ భూముల నుంచి వెళ్తుండటంపై రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం సర్వేల్ గ్రామ పరిధిలో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ ఖరారులో భాగంగా సర్వే నిర్వహించారు. వాస్తవానికి గతంలో అక్కడికి దాదాపు నాలుగున్నర కిలోమీటర్ల దూరంలోని కంకణాలగూడెం సమీపంలో మార్క్ చేశారు. కానీ ఇప్పుడు సర్వేల్-లింగారెడ్డిగూడెం మధ్యలోకి దాన్ని మార్చారు. దీంతో ఆ అలైన్‌మెంట్ వల్ల భూమిని కోల్పోవాల్సి వస్తుందనే భయంతో కొందరు రైతులు చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డికి ఫోన్ చేశారు. గతంలో అలైన్‌మెంట్‌ను ఎందుకు మారుస్తున్నారు? అని సంప్రదిస్తే... అసలు ఆ సర్వే తమకు సంబంధం లేకుండానే జరుగుతున్నదని ఆర్డీవో సమాధానమివ్వడంతో రైతులు విస్తుపోయారు. అధికారులకు తెలిసే తాము సర్వే చేస్తున్నట్టు సర్వేబృందం చెప్తుండగా.. రెవెన్యూ అధికారులు మాత్రం తమకు అలాంటిదేమీ తెలియదని అంటున్నారు. కాగా దీనిపై 'నమస్తే తెలంగాణ' కూడా ఆర్డీవో శేఖర్‌రెడ్డికి ఫోన్ చేయగా.. ఆ సర్వేతో తమకు సంబంధం లేదని చెప్పారు. ఆ విషయాన్నే రైతులకు కూడా చెప్పానని సమాధానమిచ్చారు.



### పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలి

*మా కుటుంబానికి గర్విపల్లి గ్రామ రెవిన్యూ పరిధిలో 20 ఎకరాల భూమి ఉన్నది. అందులో 6 బోర్లతో వ్యవసాయం చేసుకుంటున్నం. ట్రిపుల్ ఆర్ కొత్త అలైన్‌మెంట్‌కు సంబంధించిన మార్కింగ్‌ను మా భూముల పక్కనే శారు. దీంతో దాదాపు 15 ఎకరాల భూమి నష్టపోతున్నం. అలైన్‌మెంట్ మార్పుతో మా కుటుంబానికి ఇబ్బందులు తప్పేలా లేవు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతిపాదించిన పాత అలైన్‌మెంట్‌నే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలి.*

*-తిరుమణి యాదయ్యగౌడ్, ఖానాపూర్ (తలకొండపల్లి మండలం)*



### మా భూములు, మా ఇండ్లను రక్షించాలి

*కొన్ని వందల ఏండ్లుగా మా తాతలు, తండ్రులు నివాసము ఊరిది. ట్రిపుల్ ఆర్ మార్కింగ్‌తో తండా మొత్తం పోతదనే షాక్ నుంచి ఇంకా బయటపడ్తలేం. భూములు, ఇండ్లు కోల్పోతే మా బతుకులు సాగేదెట్ల? ట్రిపుల్‌ఆర్ కొత్త అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకొని మా భూములు, మా ఇండ్లను రక్షించాలి.*

*- ముడావత్ దశరథం, గుడితండా (ఆమనగల్లు మండలం)*



### పేద ప్రజల పొట్ట కొట్టొద్దు

ఖానాపూర్‌లో నాకు ఎకరం అసైన్డ్ భూమి ఉన్నది. దానితోనే కుటుంబాన్ని పోషించుకుంటున్న. ఇప్పుడు ట్రిపుల్ ఆర్ మార్కింగ్ నా భూమి పక్కనే వేసిండ్రు. ఉన్న ఒక్క ఎకరం భూమి కూడా రోడ్డులో పోతే మేమెట్ల బతాకాలె? మాలాంటి చిన్న రైతుల గురించి సర్కారు ఆలోచించాలెగదా!

- వెంకటయ్య. ఖానాపూర్ (తలకొండపల్లి మండలం)



### తండాను కాపాడండి

*ట్రిపుల్ ఆర్‌కు సంబంధించిన తండాకి అతి దగ్గరలో వేయడంతో భయంతో రోజులు గడుపుతున్నం. తండాలో సంవత్సరాలుగా వ్యవసాయాన్ని నమ్ముకుని బతుకును వెళ్లదీస్తున్నం. తండాకి ఎప్పుడు ఏ అధికారి వస్తడో, ఏం చెప్పి వెళ్తాడోనని అందరం భయపడుతున్నం. మార్క్ వేసినప్పటి నుంచి బాధపడని రోజు లేదు. ప్రతిరోజు చస్తూ బతుకుతున్నం.*

*- ముడావత్ సాలి, గుడితండా (ఆమనగల్లు మండలం)*



### మా బతుకులు ఆగమైతున్నాయి

ఉన్న రెండు ఎకరాలు సాగు చేసుకుంటూ మేం బతుకుతున్నం. మా భూమి పక్కన ట్రిపుల్ ఆర్ రోడ్డుకు సంబంధించిన మార్కింగ్ వేయడంతో ఎకరం భూమిని నష్టపోతున్నం. ఉన్న కొద్దిపాటి భూమిలో రోడ్డేస్తే మేమెట్ల బతకాలె? భూమి పోతే కుటుంబాన్ని ఎట్లా పోషించాలె? రైతులకు నష్టం చేసే ఆలోచనను ప్రభుత్వం ఇప్పటికైనా వెనక్కి తీసుకోవాలి

*- బండారు పార్వతమ్మ, గర్విపల్లి (తలకొండపల్లి మండలం)*